బీఆర్ఎస్‌తోనే సామాజిక న్యాయం

భువనగిరి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్

ఇబ్రహీంపట్నం, మార్చి 23: బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాల వారికి సామాజిక న్యాయం జరుగుతున్నదని ఆపార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థిగా పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించిన అనంతరం ఆయన మాట్లాడారు. అన్నివర్గాల వారికి రాజ్యాధికారం దక్కాలన్న ఉద్దేశంతో పార్టీ అధినేత కేసీఆర్ తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించారన్నారు. తెలంగాణ సాధించిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అన్నివర్గాల వారికి రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాధికారం అందించిందన్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ బలంగా ఉందని, పార్టీ నాయకులను సమన్వయం చేసుకుని జెండా ఎగరవేస్తామన్నారు. కొంతమంది అవకాశవాదంతో పార్టీని వీడుతున్నారని, అలాంటివారు పార్టీవీడినా ఎలాంటి నష్టం లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాలతో పాటు అన్నివర్గాలకు సమన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్‌ను విజయతీరాలకు చేరుస్తామన్నారు .ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు, వెనుకబడిన తరగతుల వారికి సామాజిక న్యాయం జరగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాదాసు శ్రీనివాస్

గులాబీ జెండా ఎగరవేయడం ఖాయం

గజ్వేల్, మార్చి 23: మెదక్ పార్లమెంట్ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ఖాయమని, ఎవరెన్ని కుట్రలు చేసినా గులాబీజెండా ఎగరవేస్తామని మాజీ ఏఎంసీ చైర్మన్, రాష్ట్ర నాయకుడు మాదాసు శ్రీనివాస్ అన్నారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు స్థానికతపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బీఆర్ఎస్‌కు అభ్యర్థులు దొరకడం లేదని మాట్లాడుతున్న రఘునందన్‌రావు బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుని బీజేపీ ఎంపీ అభ్యర్థులుగా ఎందుకు ప్రకటించారో సమాధానం చెప్పాలన్నారు. బీజేపీకి నిలబడే అభ్యర్థులు లేక బీబీ పాటిల్, ఆరురి రమేశ్, సైదిరెడ్డి, భరత్‌లను చేర్చుకొని టిక్కెట్ ఇచ్చిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. వెంకట్రామిరెడ్డి సుదీర్ఘకాలం ఉమ్మడి మెదక్ జిల్లాలో అధికారిగా పనిచేసి ఇదే పార్లమెంట్ పరిధిలోని తెల్లాపూర్‌లో స్థిరనివాసం ఉంటున్నారన్నారు. సమావేశంలో కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు కృష్ణారెడ్డి, నర్సింగరావు, శ్రీధర్, రమేశ్ గౌడ్, ఉమార్, నిజాం, స్వామి పాల్గొన్నారు.

గులాబీ జెండా రెపరెపలాడాలి

- **కరీంనగర్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్**
- **హుజురాబాద్ కిట్స్ కళాశాలలో హుస్నాబాద్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం**

హుస్నాబాద్, మార్చి 23: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా రెపరెపలాడటం ఖాయమని, ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌కే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సింగాపురంలోని కిట్స్ కళాశాలలో జరిగిన హుస్నాబాద్ టౌన్, రూరల్, అక్కన్నపేట, కోహెడ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కరీంనగర్ ఎంపీగా ఐదేండ్లు పనిచేసిన బండి సంజయ్ తన పార్టీ కోసం పనిచేశారు తప్ప ప్రజలకోసం ఎప్పుడూ పనిచేయలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన బండి మళ్లీ ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌ను రూ.వెయ్యికోట్లతో స్మార్ట్‌సిటీగా ఎంపిక చేయించామని, కరీంనగర్ నుంచి మనోహరాబాద్‌కు రైల్వే ప్రాజెక్టు మంజూరు చేయించామన్నారు. రాష్ట్రంలో కరెంటు, సాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించడం లేదని ఆరోపించారు. అప్పులు చేశారని సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే చెప్పడం విడ్డూరంగా ఉందని, విద్యుత్ ఉత్పత్తి, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, కాల్వల నిర్మాణం కోసమే అప్పు చేశామనేది ప్రజలకు తెలుసన్నారు. తెలంగాణకు ముందు 7,778మెగావాట్ల విద్యుత్ మాత్రమే ఉండేదని, కేసీఆర్ సీఎం అయ్యాక 26వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణరావు, సిద్దిపేట జడ్పీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, నాయకులు ఎండీ అన్వర్, మల్లి కార్జున్‌రెడ్డి, దేవేందర్‌రావు, నరేందర్‌రెడ్డి, కొక్కుల సురేశ్, లక్ష్మణ్, భూక్యా మంగ్రీనివాస్, మాలోతు లక్ష్మీబీలూనాయక్, పెసరు సాంబరాజు, లకావత్ మానస, శ్రావణి, మదన్‌మోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

బెజ్జంకి, మార్చి 23: యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని క్రాసింగ్ వద్ద డ్రోన్ స్ప్రేయర్ యంత్రంతో పురుగు మందు కొట్టే యువకులతో కొద్దిసేపు ఆయన ముచ్చటించారు. ఆయన వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

యంత్రాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

బీఆర్ఎస్ నేత శ్రీహరికి పరామర్శ

హుస్నాబాద్, మార్చి 23: కోహెడ మండలం శనిగరంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరిని మాజీ ఎంపీ, కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ శనివారం పరామర్శించారు. శ్రీహరికి ఇటీవల కంటి శస్త్ర చికిత్స జరుగగా ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అగిడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు గవ్వ వంశీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కర్ర శ్రీహరిని పరామర్శిస్తున్న వినోద్‌కుమార్

బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ

హుస్నాబాద్, మార్చి 23: హుస్నాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఇటీవల మృతిచెందిన వడ్డెపల్లి శ్రీజ కుటుంబాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం పరామర్శించారు. శ్రీజ దశదినకర్మ కార్యక్రమానికి హాజరై ఆమె చిత్రపటం వద్ద మంత్రి నివాళులర్పించారు. అనంతరం శ్రీజ తండ్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వెంకటరమణతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



శ్రీజ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం

గంజాయి విక్రయిస్తున్న నిందితుల అరెస్ట్

సిద్దిపేట అర్బన్, మార్చి 23: నిషేధిత గంజాయి రవాణా చేస్తూ విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన సంఘటన సిద్దిపేట త్రీ టౌన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సిద్దిపేట ఏసీపీ జి.మధు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం కొండపాక మండలం సిర్సినగండ్ల నుంచి ముగ్గురు వ్యక్తులు బైక్‌పై గంజాయి తరలిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు సీఐ విద్యాసాగర్, ఎస్సై విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామ శివారులోని బట్టి రామన్నపల్లి బస్టాండ్ చౌరస్తా వద్ద తనిఖీ చేయగా.. వారి వద్ద సుమారు 4 కిలోల 200 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.1,06,250 విలువ ఉంటుందన్నారు. తేలికగా డబ్బులు సంపాదించడంతో పాటు గంజాయి సేవించడానికి అలవాటు పడి ముగ్గురు నిందితులైన భానుప్రసాద్, నరేశ్, శేఖర్ రాత్రి సమయంలో బైక్‌లను దొంగిలిస్తూ.. దొంగిలించిన మోటార్ సైకిళ్లను ఒరిస్సా రాష్ట్రంలో గుర్తుతెలియని వ్యక్తులకు ఇచ్చి.. దానికి బదులుగా పెద్ద మొత్తం గంజాయి ప్యాకెట్లు తీసుకొని గ్రామాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. గంజాయి రవాణా చేస్తున్న నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ విద్యాసాగర్, ఎస్సై విజయ్‌భాస్కర్, సిబ్బంది అజ్జల్, శ్రీనివాస్, నరేశ్, స్వామి, కరుణాకర్, వినోద్ కుమార్, వెంకటేశ్, తిరుపతిలను ఏసీపీ అభినందించారు.

ములుగులో...

ములుగు, మార్చి 23: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసిన పోలీసులువారిని రిమాండ్‌కు తరలించారు. శనివారం ములుగులోని పోలీస్‌స్టేషన్‌లో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. వర్గల్‌కు చెందిన తలారి భరత్‌కుమార్, మర్గడి నిఖిలేశ్వర్‌రెడ్డి ములుగులో గంజాయి విక్రయిస్తుండగా ములుగు ఎస్సై విజయ్‌కుమార్ తమ సిబ్బందితో పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. హైదరాబాద్‌లోని ధూళిమిట్టలో గంజాయి కొనుగోలు చేసి వర్గల్, ములుగు మండల యువకులు, కూలీలకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎస్సై విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పారదర్శకంగా విధులు నిర్వహించాలి

సిద్దిపేట అర్బన్, మార్చి 23: ప్రజల సమస్యలపై వెంటనే స్పందించడంతో పాటు.. పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించాలని మల్టీజోన్-1 ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఏవీ రంగనాథ్ తెలిపారు. శనివారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన సీపీ అనురాధతో కలిసి జిల్లాలో ఉన్న పోలీస్ అధికారులతో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు సీపీ అనురాధ జిల్లా భౌగోళిక పరిస్థితులు, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పరిధి, పోలీస్ లోకేషన్లు, పోలింగ్ కేంద్రాలు, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు, సబ్ డివిజన్లు, పోలీస్‌స్టేషన్లు తదితర అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఐజీ రంగనాథ్ మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అధికారులు, సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలని.. స్వేచ్ఛాయుత ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమిష్టిగా విధులు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు మధు, సతీశ్, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్, రవీందర్, సుమన్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐజీ రంగనాథ్

వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయం

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 23 : మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలువడం ఖాయమని ఆపార్టీ మండలాధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్ అన్నారు. శనివారం కొండపాక మండలం దుద్దెడలో ఆయన మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలువడం ఖాయమన్నారు. డ్రామా పీడీగా, అడిషనల్ కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా విధులు నిర్వహించి ప్రజలతో దగ్గర సత్సంబంధాలు కలిగిన వ్యక్తిగా వెంకట్రామిరెడ్డి అని గుర్తుచేశారు. విద్యావంతుడు ప్రజల బాధలు, కష్టసుఖాలు తెలిసిన వ్యక్తి మెదక్ ఎంపీగా ప్రజల ముందుకు రావడం ప్రజల అదృష్టమన్నారు. గులాబీ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలోనే మెదక్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భారీ మెజార్టీతో గెలువడం ఖాయమని ఆయన అన్నారు.

నూనె కుమార్‌యాదవ్

ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే

గజ్వేల్, మార్చి 23: మెదక్ పార్లమెంట్ పరిధిలో ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే తప్పకుండా ఉంటుందని, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని గజ్వేల్ పట్టణ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి నవాజ్‌మీరా అన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు నాయకత్వంలో ఉమ్మడి జిల్లా అభివృద్ధి చెందిందన్నారు. అధికార పార్టీ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు ముందుకు రావడం లేదన్నారు.

ముగిసిన పరిశోధన సదస్సు

సిద్దిపేట టౌన్,మార్చి 23 : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో కొనసాగిన జాతీయ స్థాయి పరిశోధన సదస్సు శనివారం ముగిసింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్ హాజరయ్యారు. పరిశోధన సమస్య,రూపరచన అంశాలపై ప్రసంగించారు. అనంతరం మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ అహ్మద్‌రజా దత్తాంశ సేకరణ తదితర అంశాలపైన ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి,అధ్యాపకులు రాజు, గోపాల సుదర్శనం, అయోధ్యరెడ్డి, రాజేందర్, సంధ్యారాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రఘునందన్ మాటలు హాస్యాస్పదం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, మార్చి 23: రఘునందన్‌రావుకు ఓటమి భయం పట్టుకున్నందున చౌకబారు విమర్శలు చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాల సాయిరామ్ విమర్శించారు. శనివారం సిద్దిపేటలోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు మేర్గు మహేశ్, నిమ్మ రజనీకాంత్‌రెడ్డి, రెడ్డియాదగిరి, నగేశ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రఘునందన్‌రావుకు కేసీఆర్, హరీశ్‌రావును విమర్శించే స్థాయి లేదన్నారు. సమర్థుడైన అభ్యర్థి ఎదురుగా ఉండడంతో పిచ్చికూతలు కూస్తున్నాడన్నారు. దుబ్బాకకు చెందిన రఘునందన్‌రావు రాజకీయ ప్రస్థానం కూడా పటాన్‌చెరు జడ్పీటీసీగా పోటీ చేయడంతోనే మొదలైందన్నారు. న్యాయవాదిగా ఉన్న రఘునందన్‌రావు ఇలాంటి చౌకబారు విమర్శలు చేయడం తగదన్నారు. కరీంనగర్ జిల్లాలో పుట్టిన వెంకట్రామిరెడ్డి ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారని గుర్తుచేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు శ్యామ్‌యాదవ్, మహిపాల్‌గౌడ్, బాబ్‌జానీ, నాగరాజ్ పాల్గొన్నారు.

శనీశ్వరాలయంలోపూజలు

వర్గల్, మార్చి 23: వర్గల్ శనీశ్వరాలయంలో శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకొని భక్తులు శనిదేవుడికి ప్రత్యేక తిల, తైలాభిషేకాలు జరిపించారు. ఉదయం ఆలయ శాశ్వత అధ్యక్షుడు, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మసిద్ధాంతి నేతృత్వంలో గణపతిపూజ, శనీశ్వపూజ, తర్పణం హోమం, పూర్ణాహుతి తదితర పూజలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

వైశ్యభవన్‌లో మహిళా దినోత్సవం

సిద్దిపేట టౌన్,మార్చి 23 : సిద్దిపేట వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక వైశ్యభవన్‌లో మహిళా దినోత్సవం, హోలీ సంబురాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధి గంప శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం వాసవి మాత పారాయణంలో పాల్గొన్నారు. డాక్టర్ మంజుష, రాజేందర్, కృష్ణమూర్తి, మంకాల నవీన్‌కుమార్,యాద శ్రీనివాస్, శ్రీనివాస్, వనజ, వాణి, మాధవి, కృష్ణవేణి, రజని, మంజుల, నాగరాణి, కల్పన, వాసవి పాల్గొన్నారు.

కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చేర్యాల, మార్చి 23: కురుమల సంక్షేమానికి ప్రభుత్వం వెంటనే కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కురుమ సంఘం చేర్యాల డివిజన్ అధ్యక్షుడు బొట్టు శంకర్, ప్రధాన కార్యదర్శి అందే నాని కోరారు. శనివారం పట్టణంలో జరిగిన కురుమ సంఘం నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 16శాతం ఉన్న కురుమలకు ప్రత్యేక స్థానం కల్పించాలని, కురుమల సంక్షేమం దృష్ట్యా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను కోరారు. సమావేశంలో నాయకుల సూర్ణ శ్రీశైలం, అశోక్, యాదగిరి, సత్యనారాయణ, బీరయ్య, కొమురయ్య, కామల్ల అనిల్, ఒగ్గు రాజు, జయరాములు పాల్గొన్నారు.

బాల్య వివాహంపై కౌన్సెలింగ్

గజ్వేల్, మార్చి 23: మండలంలోని కొడకండ్ల గ్రామానికి చెందిన 14 ఏండ్ల బాలికకు వివాహం జరిగిందని తెలుసుకొని రెవెన్యూ, గజ్వేల్, రాయపోల్ ఐసీడీఎస్ అధికారులు గ్రామానికి చేరుకున్నారు. అమ్మాయి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చిన తర్వాత అమ్మాయిని సిద్దిపేటలోని సీడబ్ల్యూసీకి తరలించారు. చిన్న వయస్సులో పెండ్లి చేయడం కారణంగా అమ్మాయి శారీరకంగా ఆరోగ్యం దెబ్బతింటుందని, అందుకు 18 ఏండ్లు నిండిన తర్వాతనే పెండ్లి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 23: ఆత్మరక్షణ కోసం బాలికలకు కరాటే అవసరమని మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న అన్నారు. గతేడాది డిసెంబర్ 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్న కరాటే శిక్షణ శనివారం ముగిసింది. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలికలకు వివిధ రకాల బెల్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో కరాటే ట్రైనర్ ఎం.రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

బెజ్జంకి, మార్చి 23: మండలంలోని లక్ష్మీపూర్, వడ్లూర్ గ్రామాల్లో ఇటీవల కురిసిన వడగండ్లకు దెబ్బతిన్న పంటలను ఏడీఏ మహేశ్ శనివారం పరిశీలించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు

హుస్నాబాద్, మార్చి 23: హుస్నాబాద్ పట్టణంలోని మేడిబావి సందిలో శనివారం ఓ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు లేచి వస్తువులు దగ్ధమయ్యాయి. ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం వరుకోలు శ్రీనాథ్ అనే వ్యక్తి నివాసం ఉంటున్న ఇంట్లో మిక్సీ ఆన్ చేసి బయటకు వెళ్లారు. మిక్సీ షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు లేచాయి. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా ఫైర్ ఇంజిన్ ఇంటిదాకా వెళ్లే పరిస్థితి లేక బిందెలు, బకెట్లతో మంటలను ఆర్పివేశారు. సుమారు రూ. 20వేల విలువచేసే వస్తువులు కాలిపోయాయి. ఫైర్ సిబ్బంది వెంకటేశం, రమేశ్, రాజు, బాలరాజు, కమలాకర్ పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలన అందరి బాధ్యత

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

సిద్దిపేట, మార్చి 23 : క్షయవ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధిని త్వరగా గుర్తించడం, వ్యాధి తీవ్రత పెరగకుండా చూడాలన్నారు. కుటుంబ సభ్యులకు రాకుండా నివారణ చర్యలు చేపట్టడంతో పాటు వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.క్షయ వ్యాధి నిర్మూలన దిశగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో గజ్వేల్, జిల్లా దవాఖాన సిద్దిపేట ,ఆర్వీఎం మెడికల్ కాలేజ్, నంగునూరు, చేర్యాల , దుబ్బాక, హుస్నాబాద్ బెజ్జంకిలో తెమడ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్షయవ్యాధి నిర్మూలనలో ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కాశీనాథ్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి, డాక్టర్లు వినోద్ బాబ్జి , రజిని, విజయరాణి, ప్రభాకర్, శ్రీకాంత్, శ్రీలత, రవీందర్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది, డెమో నవీన్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

5కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ మను చౌదరి

ప్రజాస్వామ్యంలో ఓటు చాలా కీలకం

- **కలెక్టర్ మను చౌదరి**

సిద్దిపేట, మార్చి 23: ప్రజాస్వామ్యంలో ఓటు అనేది చాలా కీలకమని కలెక్టర్ మను చౌదరి అన్నారు. శనివారం ఉదయం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గం ఏఆర్‌వో, ఆర్డీవో సదానందం, స్వీప్ నోడల్ అధికారి, డీఆర్డీవో జగదేవ్ ఆధ్వర్యంలో కలెక్టర్ జెండాఊపి 5కే రన్‌ను ప్రారంభించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

దుబ్బాక టౌన్, మార్చి 23: ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సామాజిక కార్యకర్త బాయికాడి లక్ష్మణ్, నైపుణ్య ఆర్గనైజేషన్ బాధ్యులు ఐలయ్య అన్నారు. శనివారం మండల కేంద్రమైన మిరుదొడ్డిలో సిద్దిపేట నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రవి, చంద్రకుమార్ పాల్గొన్నారు.

మీడియా సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్

సిద్దిపేట అర్బన్, మార్చి 23: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో మీడియా సెంటర్‌ను శనివారం కలెక్టర్ మనుచౌదరి ప్రారంభించారు. గత శాసనసభ ఎన్నికల్లో ఈ సెంటర్ ద్వారా నిర్వహించిన విధులు, సమాచారాన్ని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం నేషనల్ గ్రీవెన్స్, సర్వీస్ పోర్టల్, సీ విజల్, 1950 డిస్ట్రిక్ట్ కాంటాక్ట్స్ సెంటర్‌ను పరిశీలించి ఎన్నికలకు సంబంధించిన వివరాలను మీడియాకు అందించాలని సూచించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలపై దాడులను ఆపాలి

సిద్దిపేట అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సిద్దిపేట మార్చి 23: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై దాడులను ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో సిద్దిపేట అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చే